నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 5 ఏప్రిల్ 2025 | RANGAREDDY



మేడిపల్లి-చరికొండ రోడ్డులో ఏర్పాటు చేసిన బారికేడ్లు



## తెలంగాణ విత్తనాల పండుగ ప్రారంభం

కడ్తాల్ మండలంలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్-భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ సంయుక్తాధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న తొలి తెలంగాణ వార్షిక విత్తనాల పండుగ శుక్రవారం ప్రారంభమైంది. వివరాలు IVవ పేజీలో..

## రైతులను రానీయకుండా..
# ఫార్మా సర్వే

- భూముల సర్వే ప్రాంతానికి రావొద్దని ముందురోజే చాటింపు వేయించిన ప్రభుత్వం
- కేసుల భయంతో ఇండ్లకే పరిమితమైన రైతులు
- ఇచ్చిన మాట ప్రకారం ప్లాట్లు కేటాయించాలి.. లేకుంటే సర్వేను అడ్డుకుంటాం : తేల్చి చెప్పిన సమ్మతి తెలిపిన రైతులు

మేడిపల్లి గ్రామంలో ఫార్మాసిటీ ఏర్పాటు కోసం గతంలో సేకరించిన భూముల్లో శుక్రవారం అధికారులు రైతులను అటు వైపు రానీయకుండానే సర్వే చేసి.. జేసీబీలతో కందకాలు తీసి, హద్దులను గుర్తించి, ఫెన్సింగ్ పనులు చేపట్టారు. కాగా, ముందురోజే సర్వే చేసే భూముల వద్దకు సమ్మతి తెలిపిన రైతులు రావొద్దని అధికారులు చాటింపు చేయించారు. దీంతో చాలామంది రైతులు కేసుల భయంతో ఇండ్లకే పరిమితమయ్యారు. ఇచ్చిన మాట ప్రకారం ప్లాట్లను తమకు కేటాయించకపోతే సర్వేను అడ్డుకుంటామని, వేసిన కంచెను తొలగిస్తామని రైతులు హెచ్చరించారు. తమ భూముల జోలికి రాకపోవడంతో కోర్టు స్టే ఉన్న భూములకు చెందిన రైతులు శాంతించారు.

యాచారం, ఏప్రిల్ 4 : మండలంలోని మేడిపల్లి గ్రామంలో ఫార్మాసిటీ ఏర్పాటు కోసం గతంలో సేకరించిన భూములకు భారీ బందోబస్తు మధ్య అధికారులు శుక్రవారం ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. మహేశ్వరం అదనపు డీసీపీ వెంకటసత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజుల సమక్షంలో భారీ పోలీస్ బందోబస్తు మధ్య రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులు ఫార్మా భూముల్లో సర్వే చేసి.. జేసీబీలతో కందకాలు తీసి, హద్దులను గుర్తించి, ఐరన్ పిల్లర్లు పాతి, ఫెన్సింగ్ పనులు చేపట్టారు. ముఖ్యంగా కొత్తపల్లి సరిహద్దు ప్రాంతంలో ఏసీపీ రాజు జేసీబీ వద్దనే ఉండి ఫెన్సింగ్ పనులను దగ్గరుండి చేయించారు. సర్వే పనుల వద్దకు రైతులు, గ్రామస్తులు, ఆందోళనకారులు రాకుండా సీఐలు, ఎస్ఐల ఆధ్వర్యంలో సివిల్, స్పెషల్ పోలీసులతో పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. మేడిపల్లి నుంచి చరికొండ వెళ్లే రోడ్డులో పోలీస్ పికెటింగ్‌తోపాటు బారికేడ్లను ఏర్పాటు చేశారు. రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనాలను ఆపి ఎక్కడికి వెళ్తున్నారంటూ వివరాలు అడిగి మరీ పంపించారు. రైతులు, ప్రజలు కేసులు పెడతారనే భయంతో భూములను సర్వే చేస్తున్న ప్రాంతాలకు వెళ్లకుండా ఇండ్లలోనే ఉన్నారు. కోర్టు స్టే ఉన్న భూములను వదిలిపెట్టి, గతంలో పరిహారం పొందిన భూములను మాత్రమే అధికారులు సర్వేచేసి ఫెన్సింగ్ పనులను ముమ్మరంగా చేపట్టారు. తమ భూముల జోలికి రాకపోవడంతో కోర్టు స్టే ఉన్న భూములకు చెందిన రైతులు శాంతించారు. పరిహారం పొందిన రైతులకు వారం రోజుల్లోగా లాటరీ పద్ధతిలో ప్లాట్లను ఇవ్వనున్నట్లు ఆర్డీవో అనంతరెడ్డి, డీసీపీ సునీతారెడ్డి స్పష్టం చేయడంతో ఆ రైతులు సైతం సర్వేకు అంగీకరించారు. ఇచ్చిన మాట ప్రకారం ప్లాట్లను ఇవ్వకపోతే సర్వేను అడ్డుకుంటామని, వేసిన కంచెను తొలగిస్తామని రైతులు హెచ్చరించారు. దీంతో పోలీసులు,అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

### ఆన్‌లైన్‌లో రైతుల పేర్లు నమోదు చేశాకే సర్వే చేయాలి..

మేడిపల్లిలో ఫార్మాసిటీ ఏర్పాటు కోసం గతంలో సేకరించిన భూముల్లో సర్వే చేస్తున్న విషయం తెలుసుకున్న మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన ఫార్మా బాధిత రైతులు శుక్రవారం సమావేశమయ్యారు. నిషేధిత జాబితా నుంచి తమ భూములను తొలగించి ఆన్‌లైన్‌లో టీజీఐఐసీ పేరును తొలగించి రైతుల పేర్లను నమోదు చేసిన తర్వాతే తమ గ్రామంలో సర్వే చేపట్టాలని..లేకుంటే సర్వేను అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఫార్మా వ్యతిరేక పోరాట సమితి సభ్యుడు సామ నిరంజన్ మాట్లాడుతూ.. పోలీసుల బందోబస్తు, బెదిరింపులకు భయపడేదిలేదన్నారు. రైతు సమస్యలను పరిష్కరించాకే భూముల వద్దకు రావాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు.



### ఇంటికో ఉద్యోగం ఇవ్వాల్సిందే..

ఫార్మాకోసం భూములిస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తామన్నారు. ఫార్మాలో భూమిని కోల్పోయా. నేను బీఈడీ చేసి నిరుద్యోగిగా ఉన్నా. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. ముందుగా ఇచ్చిన మాట ప్రకారం ఫార్మా కోసం భూములిచ్చిన ప్రతి రైతు కుటుంబంలో ఒకరికీ కచ్చితంగా ఉద్యోగం ఇవ్వాలి. లేదంటే మా భూమిని ఫార్మాకు ఇచ్చేది లేదు. అవసరమైతే సర్వే, ఫెన్సింగ్ పనులను అడ్డుకుంటాం.

-మక్కపల్లి సుధాకర్, నిరుద్యోగి మేడిపల్లి



### కోర్టు స్టే ఉన్న భూముల జోలికి వస్తే ఊరుకోం

కోర్టు స్టే ఉన్న భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదు. ఆ భూములను వదిలిపెట్టి సర్వే చేయాలి. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ముందుగా రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో ఎక్కించి.. ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి. లేదంటే ఫార్మా వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో రైతులందరం కలిసి ఉద్య మిస్తాం.

-బొడ్డు సందీప్‌రెడ్డి, మేడిపల్లి



### భూనిర్వాసితులకు ప్లాట్లు పంపిణీ చేయాలి

ఫార్మాసిటీ కోసం భూములిచ్చిన రైతులకు ముందుగా ప్లాట్లను పంపిణీ చేయాలి. వారం రోజుల్లోగా లాటరీ పద్ధతిలో రైతులకు ప్లాట్ల కబ్జా ఇవ్వాలి. ప్రభుత్వమే ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించాలి. అధికారులు ఇచ్చిన మాట తప్పి వారంలోగా ప్లాట్లు పంపిణీ చేయకపోతే మళ్లీ ఆందోళనలు చేస్తాం. గ్రామంలో కొనసాగుతున్న సర్వే, ఫెన్సింగ్ పనులను అడ్డుకుంటాం.

-పాచ్చ భాష, మాజీ సర్పంచ్ మేడిపల్లి



ఫార్మా భూముల్లో ఏర్పాటు చేస్తున్న ఫెన్సింగ్



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో మాజీ మంత్రి సబితారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల బీఆర్ఎస్ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మెతుకు ఆనంద్, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్‌రెడ్డి, పైలెట్ రోహిత్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పంజుగుల శ్రీశైల్‌రెడ్డి, పీ కార్తీక్‌రెడ్డి తదితరులు

# బీఆర్ఎస్‌లో రజతోత్సవ సంబురం

- నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు
- మహాసభకు ఒక్కో నియోజకవర్గం నుంచి 3000 మంది తరలివెళ్లేలా సమాయత్తం
- మాజీ మంత్రులు, మూడు జిల్లాల అధ్యక్షులకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం

సిటీబ్యూరో, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ పార్టీ ఏర్పడి 25 వసంతాలు పూర్తి కావస్తున్న సందర్భంగా రజతోత్సవ సన్నాహక సమావేశాలు నియోజకవర్గాల వారీగా నిర్వహించేందుకు హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు సన్నద్ధమయ్యారు. మాగంటి గోపీనాథ్, శంభీపూర్ రాజు, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన ఆయా జిల్లాల్లో సెగ్మెంట్ల వారీగా సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన శుక్రవారం ఎర్రవెల్లిలోని ఆయన నివాసంలో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల పార్టీ ముఖ్యనేతలతో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రులు, మూడు జిల్లాల అధ్యక్షులకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. రజతోత్సవ మహాసభకు ఒక్కో నియోజకవర్గం నుంచి మూడు వేల మంది తరలివెళ్లేలా సన్నద్ధమవుతున్నారు. సమావేశంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీలు నవీన్‌రావు, సురభి వాణీదేవి, శంభీపూర్ రాజు, డాక్టర్ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, మాధవరం కృష్ణారావు, బండారి లక్ష్మారెడ్డి, సుధీర్‌రెడ్డి, ముఠా గోపాల్, మర్రి రాజశేఖర్ రెడ్డి, కాలేరు వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు కొప్పుల మహేశ్‌రెడ్డి, డాక్టర్ మెతుకు ఆనంద్, పైలెట్ రోహిత్‌రెడ్డి, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పటోళ్ల కార్తీక్ రెడ్డి, మన్నె గోవర్ధన్‌రెడ్డి, జయసింహ, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు మన్నె క్రిశాంక్, గజ్జెల నగేశ్, నివేదితాసాయన్న, పంజుగుల శ్రీశైల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజాప్రతినిధులు, నేతలు



సీసీ కెమెరాలో నమోదైన దొంగల ముఠా



### చోరీ కేసులను ఛేదిస్తాం..

జిల్లాలో చోరీల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించాం. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ఇప్పటివరకు జరిగిన చోరీ కేసుల్లో కొన్నింటినీ ఛేదించడంతోపాటు సొత్తును కూడా రికవరీ చేశాం. మరోవైపు వికారాబాద్ జిల్లా కేంద్రంలో చోరీ చేసింది అంతర్రాష్ట్ర ముఠానే.. చెడ్డీ గ్యాంగ్ కాదు. దొంగలు రైళ్లలో కర్ణాటక, మహారాష్ట్రల నుంచి ఇక్కడికి వచ్చి వచ్చి చోరీలకు పాల్పడుతున్నారు. వారిని త్వరలోనే పట్టుకుంటాం.

- నారాయణరెడ్డి, వికారాబాద్ ఎస్పీ

# పోలీసులకు కొత్త సవాళ్లు

- వికారాబాద్ జిల్లాలో రెచ్చిపోతున్న దొంగలు
- గత నాలుగైదు నెలల్లో పెరిగిన చోరీలు
- తాజాగా జిల్లాలో చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్
- వికారాబాద్ పట్టణంలో సీసీ కెమెరాకు చిక్కిన ఓ ఇంట్లో అర్ధరాత్రి చెడ్డీ గ్యాంగ్ చోరీ దృశ్యాలు
- అది చెడ్డీ గ్యాంగ్ కాదు.. అంతర్రాష్ట్ర ముఠాగా పోలీసుల గుర్తింపు
- దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాల ఏర్పాటు : ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో దొంగలు రెచ్చిపోతున్నారు. గత నాలుగైదు నెలలుగా జిల్లాలోని ఏదో ఒక ప్రాంతంలో దొంగతనాలు, చైన్ స్నాచింగ్ కేసులు నమోదవుతూనే ఉన్నాయి. పెరుగుతున్న చోరీలు పోలీసులకు సవాల్‌గా మారాయి. పక్కా ప్లాన్‌తో సొత్తు, నగదును తస్కరించి పరారవుతున్నారు. వికారాబాద్, తాండూరు, పరిగి తదితర ప్రాంతాల్లో దొంగతనాల కేసులు నమోదవుతున్నా.. పోలీసులు సరిగ్గా నిఘా పెట్టకపోవడం గమనార్హం. ఏదైనా చోరీ జరిగిన రెండు, మూడు రోజుల వరకు రాత్రివేళల్లో గస్తీ నిర్వహించడం తదనంతరం పట్టించుకోవడంలేదనే ఆరోపణలున్నాయి. చోరీ కేసుల ఛేదనలోనూ పోలీసులు కొంత అలసత్వం వహిస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. అయితే, జిల్లాలో చోరీలకు పాల్పడుతున్నది అంతర్రాష్ట్ర దొంగల ముఠాలేనంటూ పోలీసులు అనుమానిస్తున్నారు. తాజాగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో చెడ్డీగ్యాంగ్ హల్‌చల్ అంటూ ప్రచారం జరిగింది. అయితే వారు అంతర్రాష్ట్ర దొంగల ముఠాగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. వికారాబాద్ పట్టణంలోని రాఘవేంద్రకాలనీలో రెండు ఇండ్లలో చోరీలు జరుగగా.. దొంగలు అచ్చం చెడ్డీగ్యాంగ్ మాదిరిగా ఉన్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో జిల్లా కేంద్రంలో చెడ్డీ గ్యాంగ్ అంటూ పుకార్లు వచ్చాయి. జిల్లాలో తాజాగా జరిగిన చోరీ కేసుతోపాటు తాండూరు, పరిగిలలో జరుగుతున్న చోరీలన్నీ అంతర్రాష్ట్ర ముఠాల పనేనని గుర్తించిన జిల్లా ఎస్పీ వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

### నాలుగైదు నెలల్లో..

గత నాలుగైదు నెలల్లో జిల్లాలో ఏదో ఒక ప్రాంతంలో చోరీ కేసులు నమోదవుతూనే ఉన్నాయి. ముఖ్యంగా వరుసగా రెండు, మూడు రోజులు సెలవులొస్తే.. ఆ సమయంలోనే చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయని పోలీసుల విచారణలో వెల్లడైంది. ముందుగానే ఏ ఇంటికి తాళం ఉందనేది దుండగులు రెక్కీ నిర్వహించి రాత్రి సమయాల్లో చోరీలకు పాల్పడుతున్నారని పోలీసులు పేర్కొంటున్నారు. విహారయాత్రకో, వివాహాలకో వెళ్లొచ్చే సరికి ఇదే అదునుగా భావిస్తున్న దొంగలు ఇల్లును గుల్ల చేస్తున్నారు. వికారాబాద్, తాండూరు పట్టణాల్లో నమోదవుతున్న కేసులకు సంబంధించి దొంగలు రైళ్లలో వచ్చి చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. వరుస చోరీలు, చైన్‌స్నాచింగ్‌లపై జిల్లా పోలీసులపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రివేళల్లో గస్తీ నిర్వహించాల్సిన కొందరు పోలీసులు కేవలం మూసివేయని హోటళ్లు, దుకాణాల వద్ద గస్తీ నిర్వహిస్తున్నారే తప్ప కాలనీల్లో మాత్రం గస్తీ నిర్వహించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాలనీలు, గ్రామాల్లో రాత్రి సమయాల్లో ఒకట్రెండు సార్లు పెట్రోలింగ్ నిర్వహిస్తే చాలా వరకు చోరీలు తగ్గే అవకాశముందని జిల్లా ప్రజలు పేర్కొంటున్నారు.

రెండు రోజుల కిందట దుండగులు వికారాబాద్ జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో రెండు ఇండ్లలో చోరీకి పాల్పడ్డారు. తాండూరు మున్సిపాలిటీ పరిధిలోని సాయిపూర్‌లో ఓ ఇంట్లో 45 తులాల బంగారం.. అదే రోజున తాండూరు మున్సిపాలిటీ పరిధిలోనే 17 తులాల బంగారంతోపాటు రూ.5 లక్షలు దోచుకెళ్లారు.


### ఇటీవల నమోదైన చోరీ కేసులు ఇలా..

పరిగి మండలంలోని హనుమాన్‌గండి తండాలో రూ.10 లక్షల విలువ చేసే 9 తులాల బంగారం, అర కిలో వెండి, 60 వేల నగదును తస్కరించారు. తాండూరు మండలంలోని గౌతాపూర్‌లో గొర్రెలు, హైదరాబాద్ నుంచి పరిగి వెళ్తున్న ఆర్టీసీ బస్సు నుంచి రూ.16,000, బొంరాస్‌పేట మండల కేంద్రంలో ఓ మహిళా మెడలో నుంచి రెండున్నర తులాల పుస్తెలతాడును దొంగలు దోచుకెళ్లారు. అయితే వీటిలో ఇప్పటి వరకు ఒక్క కేసునూ ఛేదించకపోవడం గమనార్హం.



## కరెంటు లేక.. నీరందక..
# ఎండిపోతున్న పల్లెప్రకృతివనం

బంట్వారం/కోట్‌పల్లి, ఏప్రిల్ 4 : గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పచ్చదనంతో పరిఢవిల్లిన పల్లెప్రకృతివనాలు అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ కొరవడి ఎండిపోతున్నాయి. ఇందుకు నిలువెత్తు నిదర్శనం కోట్‌పల్లి మండలం, ఒగ్లపూర్ గ్రామంలోని పల్లెప్రకృతి వనమే. ఇక్కడి పల్లెప్రకృతివనం, నర్సరీలో సుమారు 2000 వరకు మొక్కలున్నాయి. కేసీఆర్ హయాంలో ప్రతినెలా వచ్చిన నిధులతో మొక్కల పెంపకానికి అప్పటి సిబ్బంది చర్యలు తీసుకున్నారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పల్లెప్రకృతివనం నిర్వహణను అధికారులు పట్టించు కోకపోవడంతో అందులోని మొక్కలు నీళ్లు లేక ఎండిపోతున్నాయి. కాగా పల్లెప్రకృతివనం, నర్సరీకి సొంతంగా బోరుతోపాటు విద్యుత్తు కనెక్షన్ లేకపోవడంతో అందులోని మొక్కలకు నీటిని అందించేందుకు క్వారీ గుంతే దిక్కు. ఆ క్వారీ నుంచి నీటిని తోడేందుకు మోటరుకు విద్యుత్తు కనెక్షన్ పక్కన ఉన్న కంకర మిషన్ కంపెనీ నుంచి తీసుకునేవారు. అయితే ఆ కంపెనీ మూత పడడంతో ప్రస్తుతం విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పల్లెప్రకృతి వనంలోని మొక్కలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



నీరందక ఎండిపోతున్న ఒగ్లపూర్ గ్రామంలోని పల్లెప్రకృతివనంలోని మొక్కలు